క్లుప్తంగా

అక్విడెక్ట్ ఇనుప రెయిలింగ్స్ చోరీ



అక్విడెక్టు తనిఖీ రహదారి రెయిలింగ్స్‌ను చోరీ చేసిన దృశ్యం

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుకు కాలువ వైపున తనిఖీ రహదారికి రక్షణగా ఉన్న గేట్లలో 16 ఇనుప రెయిలింగ్స్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వీటి విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని అంచనా. దీనిపై ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ మంగళవారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ శాఖ ఏఈలుగా నరేష్, అశోక్



పి.నరేష్



టి.అశోక్

రావులపాలెం/ఆత్రేయపురం: రావులపాలెం, ఆత్రేయపురం విద్యుత్ శాఖ ఏఈలుగా పి.నరేష్, టి.అశోక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కొత్తపేట ఏఈగా పనిచేస్తున్న నరేష్ రావులపాలెం బదిలీ అయ్యారు. అలాగే గోకవరం ఏఈగా పనిచేస్తున్న టి.అశోక్ ఆత్రేయపురానికి బదిలీపై వచ్చారు. వీరికి సిబ్బందిఅభినందనలు తెలిపారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



లూటుకుర్రులో ఉపాధి హామీ పనుల్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అడబాల తాతకాపు సూచించారు. లూటుకుర్రులో ఉపాధి హామీ ద్వారా కొబ్బరిచెట్ల పళ్లాలు ఏర్పాటు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. తాతకాపు మాట్లాడుతూ ఉపాధి హామీలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొబ్బరి రైతులకు దీనిని అనుసంధానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె.బ్రహ్మానందం, వార్డు సభ్యులు బోనం అబ్బులు, అడబాల చిన్ని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెతో సేవలకు అంతరాయం

ఆలమూరు: జీఓ నెం 85ను రద్దు చేయాలని కోరుతూ గత వారం రోజులు పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న సమ్మెతో రోగుల సేవలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. దీంతో అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రుల్లో వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను, ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయించి రూ వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అలాగే గత ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎఫ్‌డీపీ (ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం) ఈ వైద్యుల సమ్మెతో నిరుపయోగంగా మారింది. ఇకనైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి వైద్యులతో సమ్మె విరమింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆర్.ఏనుగుపల్లిలో 28.7 లక్షలతో 30 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి, కె.ఏనుగుపల్లిలో రూ.39.9 లక్షల వ్యయంతో 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు, పైప్‌లైన్ విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జె.కళ్యాణ చక్రవర్తి, ఎంపీటీసీలు యాండ్ర విజయలక్ష్మి, కె.సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఈదరాడలో..

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గంలో జటిలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందించామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈదరాడలో మంగళవారం సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. శివారు ప్రాంతం కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీని పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించానని తెలిపారు. రహదారుల అభివృద్ధి, విద్యుత్ తదితర సమస్యలను కూడా పరిష్కరించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సమావేశంలో డీపీఓ రాంబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డీటీ శరణ్య, అధికారులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎగుమతులు

- పెరిగిన సరుగుడు ధరలు
- రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

మలికిపురం: రాజోలు దీవి నుంచి సరుగుడు ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. గత నెల రోజుల క్రితం కంటే ప్రస్తుతం ఎగుమతులు ఊపందుకున్నాయి. సరుగుడు ఉత్పత్తుల ధరల పెరుగుదలలో గణనీయమైన మార్పు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. నెల కిందట టన్ను రూ.4,500 ఉన్న పేపర్ రద్దు సరుగుడు రకం ప్రస్తుతం రూ.8 వేలు పలుకుతోంది. బాదులు టన్ను రూ.9,000 వరకూ ధర పలుకుతోంది. అయితే పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా టన్ను సరుగుడు పేపర్ రద్దు రూ.8 వేలు, బాదుల ధర రూ.12 వేలు ధర ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత పదేళ్లుగా సరుగుడు ధర అంతంత మాత్రంగానే ఉంటోంది. వాణిజ్య పంట అయిన సరుగుడు నాటిన తరువాత చేతికందడానికి సుమారు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది. ఈలోపు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవాలి. ఎండల ధాటికి ఆగాలి. అప్పటి వరకూ సుమారు రూ.70 వేల పైబడి పెట్టుబడి అవుతుంది. పంట చేతికందే సమయానికి రూ.80 వేలు పైబడి మాత్రమే వస్తుంది. ఈలోపు అప్పు చేసి పెట్టిన పెట్టుబడికి వడ్డీలు అధికమవుతాయి. చివరకు మిగిలేది నష్టాలు. సరుగుడు వినియోగం కూడా రానురానూ తగ్గుముఖం పడుతోంది. ప్రధానంగా సరుగుడును భవన నిర్మాణాల్లో సెంట్రింగ్‌గాను, పేపర్ తయారీకి పేపర్ మిల్లులకు తరలిస్తారు. అయితే భవన నిర్మాణాల్లో ఇనుప సెంట్రింగ్‌ల వాడకం నానాటికీ అధికమవుతోంది. దీంతో



రాజోలు దీవి సముద్రతీరంలో సాగుతున్న సరుగుడు సాగు

అక్కడ సరుగుడుకు డిమాండ్ తగ్గుతోంది. దీంతో ధర గిట్టుబాటు కావడం లేదు. అయితే ఇక్కడ పొలాల్లో రైతులకు సరుగుడు తప్ప ప్రత్యామ్నాయ పంట లేదు. ఇక్కడి భూములు పూర్తిగా ఇసుకతో



జోరుగా సాగుతున్న సరుగుడు బాదుల ఎగుమతి

నిండి ఉంటాయి. సరుగుడు తప్ప వేరే పంట పండదు. ఇలా అవస్థలతో కూడుకున్న సరుగుడు పంట గత నెల రోజుల నుంచి ధర పెరగడంతో రైతులకు ఉపశమనం లభిస్తోంది. ప్రతిరోజూ రాజోలు దీవి

నుంచి రోజుకు సుమారు 100 టన్నులకు పైబడి సరుగుడు ఎగుమతులు జరుగుతున్నాయి. గతంలో పేపరు రద్దు రాజమహేంద్రవరం పేపర్ మిల్లుకు, బాదులు హైదరాబాద్, ముంబై తదితర ప్రాంతాలకు ఎగుమతయ్యేవి. ప్రస్తుతం అధిక శాతం సరుగుడు ఉత్పత్తి పేపర్ మిల్లులకే ఎగుమతి అవుతోంది. గత పదేళ్లుగా ధర లేక, రాజోలు దీవిలో సముద్రతీరంలో సరుగుడు నాట్లు తగ్గించేశారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం పేపరుమిల్లుతో పాటు భద్రాచలం పేపర్‌మిల్లుకు కూడా డిమాండ్ ఏర్పడడంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. దీంతో కొరత ఏర్పడింది. రాజోలు దీవిలో సముద్రతీర ప్రాంతంలో సుమారు 16 గ్రామాల్లో 30 వేల ఎకరాల్లో సరుగుడు పంటను రైతులు సాగు చేస్తున్నారు. పదేళ్లలో లాభదాయకంగా లేక తోటలు వేయడం లేదు. దీంతో 30 శాతం సరుగుడు సాగు తగ్గినట్లు రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో డిమాండ్ ఏర్పడి ధర పెరిగింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి సరుగుడు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని సాగుపై ఆధార పడిన రైతులు, కార్మికులు కోరుతున్నారు.

ధర బాగుంది



గత కొంత కాలంగా ధర లేక సరుగుడు రైతులు దారుణంగా నష్టపోయారు. ప్రస్తుతం కాస్త పెరిగిన ధరతో రైతులకు కాస్త ఊరటనిస్తుంది. ధరలో హెచ్చుతగ్గులు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే తీర ప్రాంతంలో వ్యవసాయం కనుమరుగయ్యే పరిస్థితి ఉంది.

– అడబాల వెంకటేశ్వరరావు, రైతు, కేశనపల్లి

గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకోవాలి



సముద్ర తీర ప్రాంతం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఏదో తాత్కాలికంగా పెరిగే ధరలతో రైతులకు ఊరట కలుగుతుందని భావించకుండా సరుగుడు రైతులకు గిట్టుబాటు ధర ఉండేలా శాశ్వత చర్యలు తీసుకోవాలి.

– తాడి నీలకంఠం, ఎస్సీ సొసైటీ నాయకుడు, అంతర్వేది

మోకాళ్లపై అధ్యాపకుల నిరసన

మలికిపురం: జీతాల కోసం మలికిపురం డిగ్రీ **కళాశాల సిబ్బంది** చేపట్టిన నిరసన దీక్ష మంగళ**వారం 14వ రో**జుకు చేరింది. ప్రధాన రహదా**రిపై సిబ్బంది** మోకాళ్లపై నడిచి వారి నిరసన **తెలియజేశారు**. గత 14 రోజుల నుంచి చేస్తున్న **సిబ్బంది జీతా**ల పోరాటం యాజమాన్యం **దిగొచ్చే వరకూ** తగ్గేది లేదని అధ్యాపకులు **స్పష్టం చేశారు.** ఈ దీక్ష శిబిరానికి వర్తమాన సినీ **హీరో, నిర్మాత** గుబ్బల రవి కిరణ్, మాజీ ఎఫ్ఏలేసీ సొసైటీ ప్రెసిడెంట్ తాడి రంపాలరాజు, దేశినీడి ఉదయ భాస్కరరావు, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ రామాంజనేయులు (నాని), నల్లి శివకుమార్, విశ్రాంత ఎకనామిక్స్ అధ్యాపకులు ఏవీకే రంజన్, చవ్వాకుల సూర్యప్రకాశరావు మద్దతు తెలిపారు.

నదులను కాపాడుకుందాం

ఆలమూరు: భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నదీ జలాలను అందించాల్సిన బాధ్యతపై ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈవో–1 బి.అప్పాజీ తెలిపారు. ఎన్‌సీసీ డైరెక్టర్ 6 ఏ నావల్ ఎన్‌సీసీ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అక్షయ అరుణ ఆదేశాల ప్రకారం ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ విద్యార్థులకు నదుల అనుసంధానం ఆవశ్యకత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి కొత్తూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి క్లీన్ ఇండియా, హెల్త్ ఇండియా, నదీ జలాలను కలుషితం కాకుండా కాపాడుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కొత్తూరు సెంటర్‌లో మానవహారంగా నిలబడి స్వచ్ఛభారత్, నదుల పరిరక్షణపై అవగాహన కల్పించారు.

సేవాభావానికి మార్గదర్శి ‘ఎన్‌ఎస్‌ఎస్’

రాజోలు: సేవాభావానికి మార్గదర్శిగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నిలుస్తుందని రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. అధ్యాపకులు కె.గణేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ జె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పితామహుడు డాక్టర్ వీకేఆర్‌వీ రావు



మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అలవరచుకోవాలి

రావులపాలెం: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో కూడా పాల్గొనే విధంగా అలవాటు పెంపొందించుకోవాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఆర్‌డీఓ సత్యనారాయణ, ఎస్సై చంటి మాట్లాడుతూ విద్యార్థులు నేటి భావి భారత పౌరులని యువత నేటి సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలు విడనాడి చదువుల్లోను, క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. అలాగే ప్రణాళికబద్ధంగా చదవడంతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ప్రముఖులతో పాటు, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన పి.లింగేశ్వర్ రెడ్డి, ఎం.పైడిరాజు, కె.ఆనందరాజుతో పాటు ఉత్తమ సేవలందించిన డాక్టర్ శ్రీకాంత్, ఆర్‌ఐ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలత తదితరులను డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చేతుల మీదుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఘనంగా



రావులపాలెంలో ఉత్తమ సేవలు అందించిన అతిథులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్కరించారు. శాలువాలు, మోమెంటోలు అందజేసి పూలదండలతో సన్మానించారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రత్యేక అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఎండాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: వరి పొలాల్లో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించిందని దానిపై రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పసుపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఏఓ మాట్లాడుతూ ఈ తెగులు ఎంటీయూ 1318 రకంలో ఎక్కువగా ఆశించిందన్నారు. ఈ తెగులు ఆశించిన ఆకుల అంచున పసుపు రంగు నీటి మచ్చలుగా ఏర్పడి క్రమేపీ ఆకులు ఎండిపోతాయన్నారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలు, అనంతరం ఎండలు, అధిక నత్రజని వాడటం ఈ తెగులు ఉధృతికి దోహద పడ్డాయన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు



పసుపల్లిలో ఎండాకు తెగులు సోకిన విధానాన్ని వివరిస్తున్న ఏఓ విజయ్‌కుమార్

తెగులు మొదట చేల గట్ల మీద ఉన్న కొబ్బరి చెట్ల నీడలో ఉన్న వరి పంటలో ఎక్కువగా అభివృద్ధి చెందిన అనంతరం చేను అంతా వ్యాపిస్తుందన్నారు. ఎండాకు తెగులు నివారణకు తాత్కాలికంగా నత్రజని ఎరువులు వాడటం నిలిపి వేయాలన్నారు. చేలల్లో ఉన్న మురుగునీటిని బయటకు తరలించి కొత్త నీటిని పెట్టుకోవాలన్నారు. అంకురం ఏర్పడే దశలో ఎకరానికి 15–20 కిలోల పొటాష్ ఎరువు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఎకరానికి ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 450 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. తెగులు ఉధృతిని బట్టి 7–10 రోజులకు రెండోసారి పిచికారీ చేసుకోవాలన్నారు. వీటిలో ఏ పురుగు మందులు వినియోగించవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ జీఆర్ఎవిఎస్ శ్రీనివాస్, సొసైటీ సీఈఓ పసుపులేటి నాగబాబు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బీఎస్ఎన్ కుమార్, ఏఈఓ డి.దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పూర్తి తోడ్పాటు

మలికిపురం: క్రీడలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మలికిపురం మండలం బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యతో పాటు క్రీడల్లో కూడా పూర్తి ప్రావీణ్యం పొందాలని విద్యార్థులకు సూచించారు. కెరీర్‌ను చక్కగా మలచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు పాఠశాల స్థాయిలో ప్రభుత్వం ఎంతో పునాది వేస్తుందన్నారు. తొలుత జాతీయ జెండా ఆవిష్కరించి అనంతరం విద్యార్థుల రోప్ మాల్కమ్, పోల్ మాల్కమ్ తదితర క్రీడా ప్రదర్శనలను ఎమ్మెల్యే తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ బోనం సీతారత్నం, ఎంపీటీసీ ఆవుపాటి ఉమ, ఎంఈఓ ఎం.విజయశ్రీ పాల్గొన్నారు.



విద్యార్థుల పోల్ మాల్కమ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవ

రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మ దహనం

మామిడికుదురు: అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలని దళిత జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గెద్దాడ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ ధర్నా చేశారు. రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉద్దేశపూర్వకంగా అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఉండి ఎమ్మెల్యేపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో జేఏసీ నేతలు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్లో ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజును తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర మాలల



గెద్దాడలో ఆందోళన నిర్వహిస్తున్న దళిత జేఏసీ నేతలు

జేఏసీ కోకన్వీనర్ కోట రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, అలాగే కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల వద్ద దళిత డాక్టర్‌ను దూషించి, ఆయనపై దాడి చేసిన కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గేమ్స్‌లో ప్రతిభ చూపాలి

రావులపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా రాణించి మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఈతకోట హైస్కూల్లో మంగళవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో భాగంగా కొత్తపేట నియోజకవర్గస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–14 అండర్–17 విభాగాల్లో 102 మంది క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్టు స్కూల్ అసిస్టెంట్ పీఈ టి.రామకృష్ణ తెలిపారు. ప్రతి క్రీడాంశంలో ఒక విభాగం నుంచి ఐదుగురు చొప్పున జిల్లా ఎంపిక చేశామన్నారు. గెలుపొందిన విద్యార్థులను స్కూలు చైర్మన్ పి.రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో చెస్‌లో జిల్లాకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

జీవనోపాధి కోల్పోతున్న కార్పెంటర్లు

అంబాజీపేట: రెడీమేడ్ వేప కర్రతో కిటికీలు, గుమ్మాలు, తలుపులు తయారు చేసి టింబర్ డిపోల్లో అమ్మడం వల్ల కార్పెంటర్లకు, చేతి వృత్తిదారులకు పనిలేక జీవనోపాధి కోల్పోతున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దుర్గామల్లేశ్వర స్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పెంటర్లు అంబాజీపేట తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ గృహోపకర వస్తువులపై ఆంక్షలు విధించాలన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల ఆమోదంతోనే కార్పెంటర్ వృత్తిదారులు మాత్రమే అమ్ముకునేలా ఏర్పాటు చేయాలని కోరారు. డిపోలలో రెడీమేడ్ వస్తువుల తయారీ అరికట్టాలని, భవన నిర్మాణ కార్పెంటర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్పెంటర్లకు లేబర్ కార్డు ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలని తదితర సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పితాని బేబీరావు, గున్నేపల్లి భీమశంకర్, కేతా సోమేశ్వరరావు, కొవ్వూరు శ్రీనివాస్‌రావు, యార్లగడ్డ అరుణకుమార్, కొప్పిశెట్టి వేంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి సహకరించండి

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో ఆర్యవైశ్యులు నిర్మించబోయే వేంకటేశ్వర వాసవీ నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి అన్ని విధాలా సహకరించాలని వాసవీ నిత్యాన్నదాన ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు నియోజకవర్గ పరిధిలో ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలసి వాడపాలెంలో ఎమ్మెల్యే బండారును కలిశారు. గత ఏడాది శ్రీకారం చుట్టిన అన్నదాన సత్రం నిర్మాణానికి సంబంధించి ఆ స్థలానికి దారి విషయంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకరించారని, నిర్మాణం విషయంలో మీరు సహకరించాలని కోరారు. దానికి ప్రతిగా బండారు మాట్లాడుతూ ఇది ఎంతో మంచి కార్యక్రమం అని, దీనికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉం



ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరిస్తున్న నియోజకవర్గ ఆర్యవైశ్య నాయకులు

టాయని హామీ ఇచ్చారు. ముందుగా ఎమ్మెల్యే సత్యానందరావును పూలమాలలు, శాలువా, గణేష్ ప్రతిమతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ నిత్య అన్నదాన ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’

మలికిపురం: రాష్ట్ర వ్యాప్తంగా ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు సర్పంచ్‌లు నల్లి విజయకుమారి, మేడిచర్ల వల్లీశ్వరి అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయ, అనుబంధ రంగాలైన పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, అధికారులు గ్రామాల్లో పర్యటించి పొలాలు సందర్శించిన అనంతరం రైతులతో గ్రామ సభ నిర్వహించారు. రైతులకు మేలైన వ్యవసాయ పద్ధతులు తెలియజేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ ప్రసన్నకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, ఏవో ఎస్.రాకేష్, వెటర్నరీ డాక్టర్ శివకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని మోరి, మోరిపోడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి అధ్యక్షతన ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆధునిక సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందుటకు అనుసరించాల్సిన విధి విధానాలపై ఏవో పీవీ నరసింహరావు వివరించారు. ఎంపీటీసీలు జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, బళ్ల సుభాషిణి, మాజీ సర్పంచ్ జాన శంకరరావు, ఉద్యాన, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి.పద్మలత రైతులకు సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ‘పొలం పిలుస్తోంది’ పేరిట ప్రజాప్రతినిధులు, వ్యవసా, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పొలం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా మంగళవారం మండలంలోని అవిడిలో వ్యవసాయ పంటల క్షేత్రస్థాయి పరిశీలన, రైతులకు ఆధునిక, సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ పద్మలత ఆధ్వర్యంలో అడపా వెంకటేశ్వరరావు వరి పొలాన్ని సందర్శించి ఎండు తెగులు ఎక్కువగా ఉందని గుర్తించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో భాగంగా దేశీయ ఆవుపేడ, మూత్రం, ఇంగువ ద్రావణం తయారుచేసే విధానాన్ని ఆర్బీకే వద్ద రైతులకు చూపించారు. ఇది తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా వరి పంటను ఎండాకు తెగులు నుంచి రక్షించుకోవచ్చని ఏఓ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, డీసీసీబీ సూపర్‌వైజర్ బాలగణేశ్వరావు, ఏఎంసీ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఎరువులు, పురుగు మందుల డీలర్ సూరవరపు రామకృష్ణ, పలువురు స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మోరిపోడులో క్షేత్ర స్థాయిలో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



నల్లచెరువులో పంట పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

తాటిపాకలో..

రాజోలు: రైతులకు వ్యవసాయ ఆధునీకరణ, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏడీఏ రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలిచ్చారు. ప్రతి మంగళవారం, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి మధుకుమార్, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి లక్ష్మీబాయి, మార్కెటింగ్ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



అవిడిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మలత

వరిలో తెగుళ్లపై రైతులకు అవగాహన

అయినవిల్లి: వరిలో తెగుళ్లు, సస్యరక్షణపై జిల్లా వ్యవసాయ అధికారి ఒ.బోసుబాబు, సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎంఏ షంషీ అవగాహన కల్పించారు. మంగళవారం నల్లచెరువు, నేదునూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలతో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరిలో ఎండాకు తెగులు ఎక్కువగా ఉందన్నారు. రైతులు అధికంగా నత్రజని వేయడం వల్ల ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 15–20 కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. అలాగే ఎకరాకు ప్లాంటోమైసిన్ 100 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్450 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగులు ఉధృతిగా ఉంటే 7, 10 రోజుల వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలన్నారు. ఈ మందు ద్రావణంలో ఏ విధమైన పెరుగు మందులు కలపవద్దన్నారు. అలాగే రైతులు టార్పాలిన్స్, స్ప్రేయర్లు, రాయితీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై.శోభ, రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.